# బామ్మ మనసు

**-భళ్ళమూడి నాగరాజు**

"ఒరే సంగూ! ఆ సంచీ అలా గట్టిగా నొక్కి పట్టుకోకురా. అందులో అరటి పళ్ళున్నాయి. పాడైపోతాయి'' అన్న బామ్మ కేకకి నాతల తిరిగి నంత పనయింది అందరూ వింటున్నారన్న బాధతో

"ఆ పిలుపు ఏంటే? సంగమేశం అని పిలువలేవూ? అందరూ వింటు న్నారు చూసావా'' అన్నాను.

"ఎవరు వింటే మనకేం. మనవాళ్లా, మనకు తెలిసినవాళ్లా ఏం? అయినా నిన్ను చిన్న ప్పట్నుంచీ సంగూ అని పిలువగాలేంది ఎవరో పరాయివాడ్ని పిల్చినట్లు సంగమేశం అని ఎలా పిలవగలనురా?'' అంది జారిపోతున్న కొంగు బుర్రమీదకి సర్దుకుంటూ.

ఆటోవాడితో మాట్లాడుతుంటే ఏదో వింత చూస్తున్నట్లు నా వంక, ఆటోవాడివంక ఎగాదిగా చూస్తూ "ఇలారా" అని పిలిచింది.

"ఏంటే బామ్మా'' అన్నాను రెండడుగులు ముందుకేసి.

"ఒరే సంగులూ! ఏంటిరా ఆ ఆటో రిక్షావాడితో మాట్లాడుతున్న భాష, ఒక్క ముక్క నాకు అర్థమై చావడంలేదు. చక్కగా తెలుగులో మాట్లాడుకో రాదూ!'' అంది.

"వాడికి తెలుగు రాదే. ఇక్కడ అందరూ ఒరి యాలోనే మాట్లాడతారు'' అన్నాను.

అంతే చర్రున ఒంటికాలు మీద లేచింది.

"తెలుగు రాదా. అయితే వాడి ఆటో వద్దు. తెలు గొచ్చినవాడిని, తెలుగువాడినే పిలువు'' అంది మొండి పట్టుదలతో తల అటూ ఇటూ తిప్పుతూ.

"అదేంటి ఆ పట్టుదల? తెలుగువాడేం తక్కువ డబ్బులకొస్తాడా ఏం?''

"వీడెంత అంటున్నాడేం?'' అంది.

"ఇరవై అంటున్నాడు'' అన్నాను.

"వాడి మొహం మండా. ఇరవై రూపాయలేం టిరా? ఊరి చివర ఉందా ఏం నీ కొంప. ప్యాసింజ ర్‌కి పదహారు రూపాయలిచ్చి మనూరినుంచి రాగా లేంది. ఇక్కడికిక్కడికి ఇరవై ఏంటిరా? అందుకే చెబుతున్నా తెలుగు ఆటోవాడ్ని పిలిస్తేనే నేను ఎక్కుతాను'' అంది పట్టుదలగా.

"తెలుగు తెలుగు అని పదే పదే అనకే'' అన్నాను మెల్లగా.

అంతే ఆ మాటతో బామ్మకి ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది.

"పింజారి వెధవా! తెలుగువాడివై వుండి తెలుగు గురించి మాట్లాడవద్దంటావేరా? ఆ రోజుల్లో రాష్ట్రం కోసం శ్రీరాములుగారు నిరాహారదీక్ష చేస్తున్న ప్పుడు 'భోజనానికి రండి' అని మీ తాతయ్యని పిలిస్తే 'పెద్దాయన రాష్ట్రం కోసం అక్కడ నిరాహార దీక్ష చేస్తుంటే నాకిక్కడ భోజనం ఎలా సహిస్తుందే' అనేవారు'' అంటూ ఇంకా ఏదో చెప్పబోతుంటే వారించి ఆటో తీసుకురావడానికి వెళ్లాను.

"బాబూ... న్యూకాలనీకి ఎంత?''

"ఇరవై''

"ఇదిగో పదిరూపాయలు తీసుకో. ఆ బామ్మ గారు అడిగితే పదే అని చెప్పు. ఆటో దిగాక ఆవిడ చూస్తుండగా మరో పదిరూపాయలు ఇస్తాను'' అని వాడిని బ్రతిమాలుకుని బామ్మ దగ్గరికి ఆటో తీసుకువచ్చి "ఎక్కవే బామ్మా'' అన్నాను.

"నీ పేరేంటి నాయనా?'' అంది ఆటోవాడిని అనుమానంతో.

"వెంకట్రావ్'' అన్నాడు ఖైనీ నములుతూ ఆటో వాడు.

"మంచి పేరు పెట్టారు మీవాళ్ళు'' అంది బామ్మ తెలుగువాడేనన్న సంతోషంతో.

కొద్ది నిముషాల్లో ఇంటిముందు ఆగింది ఆటో.

"ఒరే సంగులూ పెద్ద ఇల్లే తీసుకున్నావురా'' అంది మూడంతస్థుల ఇంటి గేట్ ముందు ఆటో దిగి.

"ఇదంతా నా ఇల్లు కాదే. ఇందులో పది కుటుం బాలు ఉంటున్నాయి. అందులో నాదో పోర్షన్'' అన్నాను ఆటోలోంచి లగేజీ దించుతూ. బామ్మ చూస్తుండగా పది రూపాయల నోటు ఆటోవాడి కిచ్చా.

"అబ్బీ! నేను మళ్లీ ఊరికి వెళ్లిపోతున్నప్పుడు నీకు కబురు పంపుతాను నువ్వేరా'' అంది ఆటోవా డితో నిజంగా వాడు పది రూపాయలకే తీసుకొచ్చా డనుకుని.

ఆ మాటలు కనీసం వినకుండా వెళ్లిపోయాడు ఆటోవాడు. రెండో అంతస్థు ఎక్కుతూ, ఆయాసప డుతూ "ఇదేంటిరా కొండమీద ఎక్కి కూర్చున్నావ్? ఇంతమీద కొంపేమిట్రా? ఆ కిందనున్న గదులే తీసుకోలేకపోయావ్?'' అంది బామ్మ నిజంగా ఆయాసపడుతూ.

ఎలాగైతేనేం ఇంట్లోకి చేరాం. గదిలోకి అడుగు పెట్టగానే బోసినోరు అంతా తెరిచి బోలెడంత ఆశ్చ ర్యపోతూ "ఇదేనేంటిరా! ఇంతేనా కొంప. మన వీధి అరుగంత లేదు. ఇన్ని మెట్లు ఎక్కి కష్టపైకి పైకొస్తే పెద్ద పెద్ద గదులనుకున్నా. కొండని తవ్వి ఎలుకను పట్టినట్టుంది వ్యవహారం. అద్దెంతేంటి?'' అంది ఆశ్చ ర్యంనుండి ఇంకా తేరుకోకుండానే.

"వెయ్యి రూపాయలే'' అన్నాను సింపుల్‌గా.

"అమ్మో...అమ్మో. ఈ రెండు గదులకి వెయ్యి రూపాయలా? మన వీధి అరుగు దీనికన్నా పెద్ద దిరా. వెధవది దారిని పోయేవాళ్లంతా దానిమీదే కూర్చుంటారు, పడుకుంటారు. సంపాదించిన దాంట్లో వెయ్యి రూపాయలు ఇంటి అద్దెకే పోసేస్తే ఇక మొగుడు పెళ్లాం ఏం తింటున్నార్రా. అందుకే చుట్టుకుపోయిన ఎలుక పిల్లల్లా తయారవుతు న్నారు. పురిటికెళ్లిన పెళ్లాం, మరో మూడు నెలల్లో చంకన ఒకడ్ని వేసుకుని వస్తుంది. ఎందుకురా ఈ ఉద్యోగాలు? ఎప్పుడు రమ్మన్నా సెలవు లేదే, ఆఫీ సులో పనే అంటావు. ఓ పండుగాలేదు, పబ్బం లేదు'' అంటూ సుదీర్ఘంగా క్లాసు తీసుకుంది.

నా పరిస్థితి చూసి నిజంగా జాలివేసి అన్నమా టలే అవన్నీ అని నేను గ్రహించాను కూడా. బామ్మ పూర్వకాలం మనిషే అయినప్పటికీ చదువుకోనప్ప టికీ నిజాలే చెప్పింది అనిపించింది. ఉద్యోగం పురు షలక్షణం అని చెయ్యడం తప్ప ఏ సంతృప్తి లేకుండా రోజులు లాక్కొస్తున్నాను.

***

"పొయ్యి ఎక్కడ పెట్టమంటావురా? కట్టెలేవీ'' అంది బామ్మ వున్న రెండు గదులూ ఇటూ అటూ తిరుగుతూ.


"ఇక్కడ పొయ్యిలు పెట్టడానికి అవ్వదే. ఇదిగో ఈ గ్యాస్ స్టవ్ మీదే వంట'' అని స్టవ్ చూపించాను.

"నీ మొహం మండా. ఓ పొయ్యా, కుంపటీ లేకుండా ఏం సంసారం చేస్తున్నావురా. ఓ వంకాయి కాల్చుకుని పచ్చడెలా చేసుకుంటావు? అప్పడం ఎలా కాల్చుకుంటావు? ఇదేం కొంపరా? నా మనమ డేదో పెద్ద కాలేజీలో పనిచేస్తున్నాడని మురిసిపో యానుతప్ప తాడూ బొంగరం లేని జీవితం వెళ్ళబె

డుతున్నాడనుకోలేదు'' అని బామ్మ తన అసంతృప్తిని బయటపెట్టింది.

'నిజమే ప్రైవేట్ కాలేజీలో ఉద్యోగం. ఆ జీతంతో అన్నీ కావాలంటే ఎలా వస్తాయి? ఏదో బ్రతికేస్తున్నాం అంతే, తప్ప' అని స్వగతం అనుకుని "బామ్మా! అన్నీ దీనిమీదే అవుతాయి'' అన్నాను నవ్వుతూ.





★★★

అసలు బామ్మని తీసుకుని రావాలన్న తలంపు లేదు. నా భార్యని పురిటికి అత్తవారింటిలో దిగబెట్టి తిరుగు ప్రయాణంలో మా వూరు వెళ్లి రాయగడ వద్దామనుకుని ఇంటికి వెళ్లా. నా భార్యని పురిటికి మా అత్తవారు తీసుకుని వెళ్లారని బామ్మతో చెప్పాను.

"ఒరే అబ్బీ! నీ పెళ్లాం వచ్చేసరికి మూడునాలుగునెలలు పడుతుంది కదా. నేనా గుండ్రాయిలా వున్నా. నీతో వస్తా. నీకు నాలుగు మెతుకులు వండి పెట్టినట్లుంటుంది నాకూ వాతావరణం మారినట్లుంటుంది. నీతో వస్తానురా. నీ సంసారం చూస్తానురా'' అంది.

'వస్తాను' అని నోరు తెరిచి అడిగితే చిన్నపిల్లల్ని 'వద్దు' అన్నట్లు ఎలాఅనగలను. 'అలాగేలే'' అన్నాను ముభావంగా.

అది గమనించిన నాన్నగారు "నువ్వక్కడ ఉండలేవే. వాడిది అద్దెకొంప. అదీగాక వాడు రెండో అంతస్థులో ఉంటున్నాడు. ఆ మెట్లు అవీ నువ్వు ఎక్కలేవు'' అన్నారు.

"నేనేం రోజూ మెట్లు ఎక్కి దిగుతానా ఏం. వాడు తీసుకుని వెళతానంటే నీకేం. కందకిలేని దురద కత్తిపీటకు అన్నట్లు నీకెందుకు? నేను వెళ్తాను'' అని బామ్మ కోపంతో అనడంతో నాన్నగారు మరి మాట్లాడలేదు. పెద్దవాళ్లకి ఆ విధంగా గౌరవం మా ఇంట్లో. ఈరోజుకి కూడా నాన్నగారు బామ్మ మాట ఏదీ కాదనరు. ఆ విధంగా బామ్మని నాతోపాటు నా ఇంటికి తీసుకునివచ్చాను.

బామ్మ చేతివంట అమృతంలావుంది. మసాలా గానీ, కారంగానీ ఎక్కువగా వాడకుండా చక్కగా వంకాయ మెంతికూర, తోటకూర పప్పు, పులుసు వండి వేడివేడిగా పెట్టింది బామ్మ. ఆవురావురని తింటుంటే చీర చెంగుతో కళ్ళు వత్తుకుంటూ "నా వైభవం అంతా అయిపోయింది. నా చేత్తో ఏమీ చేసి పెట్టలేకపోతున్నాను'' అంటూ బాధపడింది.

భోజనం చేసేసి నేను ఆఫీసుకు వెళ్లాను. సాయంకాలం తిరిగి వచ్చేసరికి బామ్మ దిగులుగా కూర్చుంది. నన్ను చూసి "ఒరే సంగులూ! నన్ను దిగబెట్టరా. వెళ్లిపోతాను'' అంది.

"అదేంటి. నా భార్య వచ్చేదాకా ఉంటానన్నావు. నిన్నే కదా వచ్చాం. అప్పుడే తొందరేంటి?'' అన్నాను.

"నాకేం తోచడంలేదురా. ఇరుగుపొరుగు వాళ్లతో ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుందాం అన్నా వాళ్లెవ్వరూ తలుపులు తీసుకుని బయటకి రావడం లేదు. పొరపాటున వచ్చినా ఆ భాష నాకు అర్థం అయి చావదు. అదీగాక అక్కడ అమ్మ, నాన్న, తమ్ముడు, మరదలు, పిల్లలు అందరి మధ్య ఉండేదాన్ని. క్షణం తెలీకుండా రోజులు గడి



## పిల్లల్ని కనే వయస్సు ఎంత?

పిల్లల్ని కనడానికి వయస్సు పైబడిపోయిందని చింతించనక్కర్లేదు. మనవల్ని ఎత్తుకునే వయస్సులో కూడా పిల్లల్ని కనగలమని ఓ జంట ఇటీవల నిరూపించింది. రాజస్తాన్‌లోని జైసల్మార్‌కి దగ్గరున్న బార్మేర్ అనే ఊళ్లో 72 ఏళ్ళ ప్రేమ్‌రామ్, 65 ఏళ్ల నైనూదేవీలకు కవలలు పుట్టారు. ఇంతటి సంతానోత్పత్తికి రహస్యమేమిటని అడిగితే మోడ్రన్ సైన్స్ ఉద్ధరింపు ఏమీ కాదుట. ఎన్నో ఏళ్ళుగా వాళ్ళు తింటున్న పప్పు, గోధుమ నూక ఉప్మాలు మాత్రమేనట. అతగాడు తరచు నల్లమందు సేవిస్తుంటాడు. ఆ ఎడారి ప్రాంతంలో ఎందరో చేస్తున్నదే అతనూ చేసాడు. ఈ లోకంలో వింతలకి అంతంటూ ఉండదేమో!

## ట్రామ్‌లో పెళ్లివారు

కోల్‌కత్తావారికి ట్రామ్‌కార్లతో అవినాభావ సంబంధం వుంది. ఇటీవల శంతన్ బెనర్జీ తన పెళ్లికి అక్షరాలా ట్రామ్‌కార్లో వెళ్లాడు. ఆ ట్రామ్ కారు పేరు ఒనలత. బెహాలా దాకా ఊరేగింపుగా వెళ్లిన ఆ ట్రామ్‌లో అతని చుట్టాలు 42మంది, ఒక స్నేహితుడు ప్రయాణం చేసారు. దీనికి తగిన కారణం వుంది. శంతన్ ముత్తాత 19వ శతాబ్దంలో ఈ ట్రామ్ సర్వీస్‌ని ఆరంభించారు. అతని తాతగారి పెళ్లి 1923లో గుర్రాలతో ఈడ్చబడిన ట్రామ్‌కార్లో జరిగిందిట. అతని తండ్రిగారి వివాహం బొగ్గు ఇంజన్‌తో నడిచిన ట్రామ్ కార్లో జరిగింది. ఆనవాయితీ తప్పించడం ఇష్టంలేక ఎలక్ట్రిసిటీతో నడిచే ట్రామ్ కార్లో ఊరేగింపుగా తన పెళ్లికి తరలి వెళ్లాడతను.

**-టి.ఆర్.ఆర్**

చిపోయేవి. ఇక్కడ క్షణం కూడా ఓ యుగంలా వుంది. అందుకే ఉమ్మడి కుటుంబం మంచిదంటారు. ఏముంది చెప్పు ఈ ఊరిలో. నీకీ ఉద్యోగం... ఎందుకు నువ్వు మనూరొచ్చెయ్. అందరం కలిసి హాయిగా ఉండొచ్చు" అంది బామ్మ ఒక్కరోజుకే విసుగు చెంది.

"కొంచెం ఓపిక పట్టవే బామ్మా. రెండిళ్ల వెనుక మన తెలుగువారు వున్నారు. చాలా మంచివాళ్ళు. వాళ్లింటికి నిన్ను తీసుకునివెళతాను. నేను కాలేజీకి వెళ్లిపోయాక రేపటినుంచి వాళ్లింటికి వెళ్లు. నీకు సరదాగా కాలక్షేపం అవుతుంది" అని నచ్చచెప్పి ఆ రోజు రాగిణి వాళ్లింటికి తీసుకుని వెళ్లాను.


***

వారంరోజులు నెమ్మదిగా గడిచాయి. బామ్మ రాగిణి వాళ్లతో బాగా కలసిపోయింది. రకరకాలుగా వంట వండి నాకు పెడుతోంది. బాగుంది అనుకుని ఆఫీసుకు వెళ్లాను. నేను కాలేజీకి చేరి మొదటి క్లాసు ఇంకా తీసుకుని అరగంట కూడా కాలేదు. ప్యూన్ వచ్చి 'మీకు ఫోన్ వచ్చింది' అని చెప్పగానే వెళ్లి ఫోనందుకున్నా.రాగిణిగారు ఫోనులో మాట్లాడుతూ "మీ బామ్మగారు మెట్లు దిగుతూ పడిపోయారు. వెంటనే రండి" అని చెప్పేసి ఫోన్ పెట్టేసారు. పిడుగుపడ్డట్టయింది ఆ వార్త విని. ఏదో సరదా పడిందని బామ్మని తీసుకునివస్తే ఇలా జరిగిందేమిటి? ఇప్పుడేం చేయాలి? ప్రమాదం లేదుకదా అని రకరకాల ఆలోచనలతో క్లర్క్ దగ్గరికి వెళ్లి జరిగింది చెప్పి ఓ వెయ్యి రూపాయలు సర్దమన్నాను.

"కలెక్షన్స్ లేవు గురూ" అన్నాడు.

వస్తూ దారిలో ఒకరిద్దర్ని అడిగా. అందరూ మొండి చెయ్యే చూపించారు. ముందు బామ్మ పరిస్థితి చూడాలన్న ఆతృతతో ఇంటికి చేరా.

బామ్మ గగ్గోలు పెడుతోంది. 'కాలు నొప్పి...నొప్పి' అని బిగ్గరగా అరుస్తోంది. "ఇంతసేపేంటిరా. ఒకవేళ మెట్లమీదనుంచి పడి తల పగిలి నేను చచ్చినా అంతేనా. వెధవ ఉద్యోగం నువ్వూ" అని కోపంతో ఏవేవో మాట్లాడుతోంది. ఆటో తీసుకుని వచ్చి రాగిణిగారు సహాయం రాగా డాక్టర్ దగ్గరికి తీసుకుని వెళ్లాను. దారంతా కాలు విరిగిపోయింది కాబోలు అని మనస్సులో బెంగ ...బామ్మ రాగాలు. డాక్టర్ మిశ్రా కాలుని పరీక్షించి "ఏంఫర్వాలేదు. ఎందుకైనా మంచిది. ఎక్స్‌రే తీసుకుని రండి" అని ఒరియాలో నాతో చెప్పాడు. వెంటనే ఎక్స్‌రే తీయించి తీసుకుని వచ్చాను.




ఎక్స్‌రే చూస్తూ "ఏం ఫర్వాలేదు. విరగలేదు. చిన్న పిసరు మడత పడింది" అని చెప్పి ఓ ఇంజెక్షన్ ఇచ్చి క్లాత్ బ్యాండ్ వేస్తూ నాలుగురోజుల్లో అంతా తగ్గిపోతుంది అని ఒరియాలోనే నాతో చెప్పాడు. బామ్మ ఆయన చెబుతున్న మాటలు అలా వింటూనే వుంది. కానీ ఒక్క ముక్క కూడా అర్థం కాదని నాకు తెలుసు. కానీ బామ్మ రెండు చేతులూ ఎత్తి డాక్టర్‌గారికి దండం పెడుతూ-

"నీ దయ నాయనా. నువ్వు నూరేళ్లపాటు చల్లగా వుండు. చల్లని మాట చెప్పావు" అంది.

నాకు ఆశ్చర్యం కలిగింది.

"బామ్మా! అతను చెప్పింది నీకు ఒక్క ముక్క అయినా అర్థం అయిందా? ఎలా చెప్పావు? ఆ రోజు ఆటోవాడ్ని తెలుగువాడినే తీసుకునిరా అన్నావు. ఈ రోజు మిశ్రాగారికి అలా దీవెనలు అందించావేంటి?" అన్నాను బామ్మకి కాలు విరగలేదన్న ఆనందంతో.

"డాక్టర్‌గారు సరస్వతీ పుత్రులురా. వాళ్లే భాషలో మాట్లాడినా రోగికి ఇట్టే అర్థం అవుతుంది. అయినా అందరూ వద్దు వద్దు అంటూ వచ్చి నీకు చాలా ఇబ్బంది కలిగించానురా" అని బాధపడింది.

***

వారంరోజుల్లో బామ్మ కాలు నొప్పి పూర్తిగా తగ్గిపోయింది. నా మెళ్ళో గొలుసు ఉండడంవల్ల గభాలున తాకట్టు పెట్టి ఓ రెండువేలు తెచ్చి బామ్మకి ఏ లోటూ రాకుండా మందులు ఇప్పించగలిగాను అన్న తృప్తి నాకు మిగిలింది.

"ఒరే సంగులూ! రేపే నేను ఊరు వెళ్లిపోతానురా. మరి ఉండలేను. నా కడుపున పుట్టకపోయినా నాకు ఈ వారంరోజులూ అన్ని సేవలు చేసావురా. నీకు కొడుకు పుడితే వాడి మెడలో ఈ గొలుసు వేద్దాం అనుకున్నాను. నీకైతేనేం వాడికైతేనేం" అంటూ తన మెడలో రెండు తులాల గొలుసు తీసి నా మెడలో వేస్తూ "నువ్వు మనూరు వచ్చేయరా. అందరం కలిసే వుందాం. కలసి వుంటే కలదు సుఖం అన్నారు పెద్దలు. ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు చేసుకోవచ్చు. అందరికీ దూరంగా నువ్వొక్కడివే ఇక్కడ ఎన్ని బాధలు పడుతున్నావో మాకెవ్వరికీ తెలీదు. మేం ఏమీ చేయలేకపోతున్నాం. వచ్చేస్తావు కదూ" అంది బామ్మ కళ్లను చీర కొంగుతో వత్తుకుంటూ.

"అలాగేలే బామ్మా" అన్నాను ఆవిడని సంతృప్తి పరచాలని. తరువాత ఆలోచనలో పడ్డాను. ఈపాటి ఉద్యోగం మా ఊరికి దగ్గర్లో చేసుకోలేనా అని. బామ్మ తన బట్టలు సంచీలో సర్దడం మొదలపెట్టింది అప్పుడే.